ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
ఆదివారం 31 మార్చి 2024





● నిబంధనలకు విరుద్ధంగా మున్నంగి రీచ్‌లో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు

ఇసుక రీచ్‌లలో.. బరితెగింపు



గుండిమెడ వద్ద నదిలో భారీ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్న దృశ్యం

● అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులే అండ

ఇసుక.. మాఫియా

- ఆందోళనలపై ఉక్కుపాదం మోపుతున్న అధికారులు
- మంగళగిరి నియోజకవర్గంలో అధికారుల విచిత్రవైఖరి
- కోడ్ వచ్చినా.. రీచ్‌లలో ఆగని ఇసుక అక్రమాలు
- గుల్లవుతున్న గుండిమెడ, వల్లభాపురం రీచ్‌లు

మంగళగిరి, మార్చి 30:మంగళగిరి నియోజకవర్గంలో గుండిమెడ, వల్లభాపురం రీచ్‌లలో రేయింబవళ్లు ఇసుక తోడివేత, అక్రమ రవాణా జోరుగా సాగుతున్నాయి. గత మూడేళ్లపాటు జేపీ వెంచర్స్ పేరుతో ఈ రెండు రీచ్‌లలో చట్టాలు, నిబంధనలను తుంగలో తొక్కితమకు అడ్డెవరు అన్నట్టుగా ఇసుకను దోచేశారు. ప్రతిపక్షాలు ఇసుకరీచ్‌ల వద్ద ఆందోళనలు చేపట్టినా, పర్యావరణ ప్రేమికులు న్యాయస్థానాల్లో కేసులు వేసినా.. ఇసుక రీచ్‌ల దోపిడీ మాత్రం ఇసుమంతైనా తగ్గలేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాతైనా ఇసుక దోపిడీకి కొంతైనా కళ్లెం పడుతుందని ఆశించినా ఆడియాసలే అయ్యాయి. కోడ్ అమల్లోకి వచ్చాక ఈ రెండు మాసాల సమయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్న ఆత్రుత కొద్దీ ఇసుక దోపిడీని మరింత ముమ్మరం చేశారు.

కాంట్రాక్ట్ ఎవరిదైనా..

గతంలో ఇసుక రీచ్‌ల కాంట్రాక్టు ఏజెన్సీ జేపీ వెంచర్స్ అన్నారు. జేపీ వెంచర్స్ కాంట్రాక్టు పీరియడ్ ముగిసినప్పటికీ గుండిమెడ, వల్లభాపురం రీచ్‌లలో మాత్రం ఇసుక దోపిడీ ఒక్కరోజు కూడా ఆగలేదు. కాంట్రాక్టు ఎవరిదైనా.. అసలు కాంట్రాక్టు ఉన్నా లేకున్నా.. సంబంధిత శాఖల నుంచి ఆదేశాలు లేకున్నప్పటికీ వైసీపీ ఐదా నాయకులు మాత్రం ఇసుకరీచ్‌ల వద్ద దాదాపు రోడ్డును వేసి మరీ ఇసుకను దోచేస్తూ వచ్చారు. ఇసుక దందాను అడ్డుకోవాల్సిన గనుల శాఖ, రెవెన్యూ శాఖ, రివర్ కన్జర్వేషన్ అధికారులు, పోలీసులు ఇసుక అక్రమ రవాణాకు సంపూర్ణంగా సహకరిస్తూ వచ్చారు. పైగా ఇసుకరీచ్‌ల వద్ద ఆందోళన చేసేందుకు వచ్చిన ప్రతిపక్ష పార్టీల వారిని అడ్డుకుంటూ ఇసుక అక్రమ తోడివేత, అక్రమ రవాణా చేస్తున్నవారికి ప్రభుత్వ యంత్రాంగం రక్షణ కల్పిస్తూ వచ్చింది.

అక్రమాలను గుర్తించిన ఎండీఈఏఫ్ అండ్ సీసీ

ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో జరుగుతున్న ఇసుక దందాను గురించి అనేక ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఈ రీచ్‌లలో క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసేందుకు మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, అటవీ, క్లైమేట్ ఛేంజ్ (ఎంఓఈఎఫ్ అండ్ సీసీ) అధికారులతో ఓ జాయింట్ కమిటీని గత జనవరిలో ఏర్పాటుచేసింది. ఈ కమిటీ జనవరి 17నుంచి 19వ తేదీ వరకు మూడు రోజులపాటు గుంటూరు జిల్లాలో ఎనిమిది, కృష్ణాజిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లను సందర్శించి ఆయా రీచ్‌లలో జరుగుతున్న అక్రమాల దందాను గుర్తించింది. విరామమే లేకుండా రోజుకు 24 గంటలపాటు భారీ మిషనరీని వినియోగిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను ఆసాంతం తోడేస్తున్న తీరును గుర్తించి కమిటీ ఆశ్చర్యపోయింది. రీచ్‌లలో సీసీ టీవీలు లేకపోవడం, సరైన వేబ్రిడ్జ్ లేకుండా, కంప్యూటర్ జనరేటెడ్ బార్‌కోడ్ పర్మిట్లు లేకుండా రవాణా చేస్తున్న తీరును చూసి కమిటీ ఖంగుతింది. రీచ్‌లలో తాము గుర్తించిన ఈ అక్రమాలను గురించి కమిటీ ఎన్జీటీకి గత నెల రోజుల కిందట నివేదికను సమర్పించింది. అయినా, ఇసుక అక్రమార్కుల ఎ క్కడా వెరవ లేదు.

ఇసుక అక్రమ తవ్వకాలను ఆపాలంటూ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకపోవటంతో జనమే చివరకు రీచ్‌ల దగ్గరకు వెళుతున్నారు. అక్రమార్కులు మాత్రం మరింత బరితెగించి జనంపైకి ట్రాక్టర్లను దూకిస్తూ, టైర్ల కింద పడేసి తొక్కిస్తూ, కత్తులు కటార్లతో దాడులకు తెగబడుతున్నారు. కానీ అధికార యంత్రాంగం చోద్యం చూస్తుండటం కొసమెరుపు. నిన్నటి వరకు ప్రభుత్వ పెద్దల ప్రమేయం, నేతల ఆదేశాలున్నాయని అధికారులు దాడులు చేయలేదనుకుంటే, ఇప్పుడు ఎన్నిక కోడ్ అమలులో ఉన్న తరుణంలో ఏ రాజకీయ నేతలతో పనిలేకున్నా ఇంకా వారికి వత్తాసుపాడుతూనే ఉన్నారు. అదేమంటే... ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలున్నాయని, ఏమీ చేయలేమని కొందరు బహిరంగంగానే చెబుతుంటే, మరి కొందరు పోలీస్, సెబ్ అధికారులయితే మరో అడుగు ముందుకేసి వసూళ్లకు సై అంటున్న పరిస్థితి. నిన్నటి వరకు ఎమ్మెల్యే, మంత్రి పేరుచెప్పి ఇసుక తరలించారని, ఇప్పుడు ఆ పప్పులేవీ ఉడకవని, ఈ రెండు నెలలు టైం మాదంటూ, నిలబెట్టి మరీ వసూళ్లకు సిద్ధపడుతున్నారని తాజాగా లారీ యజమాన సంఘాలే ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఏ రీచ్‌కు అనుమతులున్నాయో! వేటికి లేవనేది కూడా రహస్యమే.

కృష్ణాతీరం భారీగా కోత..

మంగళగిరి నియోజకవర్గంలో గుండిమెడ, వల్లభాపురం రీచ్‌లలో జరుగుతున్న ఇసుక దందాతో దిగువ కృష్ణా తీరం భారీ కోత పడుతూ వస్తుంది. దీంతో పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుంది. మరోవైపు గుండిమెడ రీచ్ నుంచి రోజుకు అయిదొందలకు పైబడి భారీ ట్రక్కుల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతుండగా వల్లభాపురం రీచ్ నుంచి రోజుకు 300 నుంచి 350 ట్రక్కుల చొప్పున తరలిస్తున్నారు. గుండిమెడ రీచ్‌నుంచి ఒక్కో ట్రక్కులో 20 నుంచి 25 టన్నుల వరకు ఇసుకను తరలించుకుపోతున్నారు. గుండిమెడ రీచ్‌నుంచి ట్రక్కులు కరకట్ట రోడ్డు మీదుగా ప్రాతూరు వచ్చి అక్కడనుంచి ప్రాతూరు- కుంచనపల్లి రోడ్డుమీదుగా హైవే ఎక్కి విజయవాడ, మంగళగిరి, గుంటూరు వైపు తరలివెళుతున్నాయి. రోడ్ల సైతం ఈ భారీ వాహనాల తాకిడికి దెబ్బతినిపోతున్నాయి. గత ఆరేడు మాసాలుగా జేపీ వెంచర్స్ బదులుగా ముఖ్యమంత్రి బంధువే ఈ రీచ్‌లను స్వయంగా దోచుకుంటున్నారంటూ సమీప గ్రామ ప్రజలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నారు.



● మున్నంగిలో ఇసుక అక్రమ తవ్వకాల కోసం నదిలో దారులు

● నిబంధనలకు పాతరేసి.. అడ్డుగోలుగా తవ్వేస్తూ...

- అనుమతులతో పనిలేకుండా ఇష్టమొచ్చిన చోట తవ్వకాలు
- మైనింగ్ శాఖకు అడ్డుకునే ధైర్యమేదీ!
- భూగర్భ జలాలు అడుగంటుతున్నా కన్నెత్తి చూడదు
- నెలవారీ మామూళ్లు కడితే చాలు.. పోలీస్, సెబ్‌కు పట్టదు
- అక్రమ తవ్వకాలను అడ్డుకుంటామంటే కత్తులు, రాడ్లతో దాడులు
- ట్రాక్టర్లతో తొక్కించి చంపేందుకూ సిద్ధం
- మొన్న అమరావతి, నిన్న మున్నంగి ఘటనలే నిదర్శనం

తెనాలి, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): గతంలో జేపీ సంస్థ, నిన్నటి వరకు జీసీకేసీ సంస్థ పేరుచెప్పి ఇసుక తవ్వేశారు. గత 6 నెలల నుంచి మరింత బరితెగించి అక్రమ తవ్వకాలకు తెగబడుతున్నారు. గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో ప్రకాశం బ్యారేజీ దిగువన గుండిమెడ, పెదకొండూరు, మున్నంగి, వల్లభాపురం, బొమ్మువానిపాలెం, గాజుల్లంక, జువ్వలపాలెం రీచ్‌లలో తవ్వకాలకు అనుమతులున్నాయని చెబుతున్నారు. అటు పల్నాడు, గుంటూరు జిల్లాల్లో బ్యారేజీ ఎగువన కె.వి.పాలెం, కొత్తపల్లి, చామర్రు, మల్లాది, వైకుంఠపురం రీచ్‌లలో అనుమతులున్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే వారికి ఆయా రీచ్‌లలో అనుమతిచ్చిన ప్రదేశం ఎక్కడ? తవ్వుతున్నది ఎక్కడనేది మాత్రం పట్టించుకునే వారే లేరు. ఇసుక తవ్వేది తక్కువైతే, అక్రమ తవ్వకాలు మాత్రం అంతులేని స్థాయిలో ఉన్నాయి. బలైపోతున్న ప్రజలు సహజ వనరుల్లో ఇసుక కోసం అడుగడుగునా నది గర్భాన్ని పేల్చేస్తూ అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఈ మధ్య జగనన్న కాలనీ పేరుతో ఇసుక రీచ్‌లకు అనుమతులు తీసుకుని ఇసుకను తరలిస్తున్నారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం రీచ్‌కు అనుమతిస్తే అక్కడ ఇసుక తవ్వకాలే జరగలేదు. దీనికి దూరంగా జువ్వలపాలెం-ఓలేరు మధ్య నదిలో తవ్వేస్తున్నారు. అయితే కొల్లూరు ఇసుక పరిశీలిస్తే మాత్రం అంతా బాగుందన్నట్టే కనిపించే పరిస్థితి. పెనుమూడి దగ్గర నీటిలో ఇసుక తవ్వకాలకు అనుమతిలేదు. కానీ అక్కడా తవ్వకాలు ఆగలేదు. కొల్లూరు మండలం గాజుల్లంకలో మరో రీచ్‌కు అనుమతి ఉందని అధికారులు చెబుతుంటే చిలుమూరు, పెసర్లంక-పెదలంక మధ్య పట్టా భూముల్లో ఇసుకే డ్డు లేకుండా తవ్వేస్తున్నారు. గతంలో ఈ లంకల్లో రైతులు అక్రమ తవ్వకాలను అడ్డుకుంటే, వారి ఇళ్లకు అర్ధరాత్రులు పోలీసులను వెంటబెట్టుకుని మరీ వెళ్లి అక్రమార్కులు బెదిరించిన పరిస్థితి. అన్నవరం, బొమ్మువానిపాలెం, కొల్లిపర, అత్తలూరివారిపాలెం, పెసర్లంక, ప్రాతూరు ప్రాంతాల్లో నూ అక్రమతవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతూనే ఉన్నాయి.

అడ్డుకుంటే తొక్కిస్తారా..?

గతంలో అమరావతి మండలంలో ఇసుక అక్రమ తవ్వకాల ఫొటోలు తీసేందుకు వెళితే విలేకరిపై విచక్షణ రహితంగా దాడిచేసి, చంపబోయారు. తాజాగా మున్నంగిలోనూ స్థానికులు అక్రమ తవ్వకాల కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని గగ్గోలు పెడుతూ అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే ఇసుక అక్రమ తవ్వకందారులు, వారి అనుచరులు ట్రాక్టర్లతో జనాన్ని తొక్కించేందుకు కొద్దిసేపు భయానక విన్యాస క్రీడే కొనసాగించారు. గుర్తించి పడిపోయిన వ్యక్తిపైకి టైరు ఎక్కించి కదలకుండా చేసి, అతను వేడుకుంటున్నా వదలకుండా మిగిలినవారు కత్తులతో విచక్షణారహితంగా తన్నారు. మరికొందరు నిలబడి ఉన్న జనంపైకి కత్తులు, రాడ్‌లు తీసుకుని దాడికి తెగబడ్డారు. కరకట్టపై వెళ్లే వాహనదారులు కూడా భయపడిపోయి పరుగులుపెట్టాల్సిన పరిస్థితి. అయితే ఈ మొత్తం వ్యవహారాన్ని పోలీసులు దాడిచేసిన వారినీ, దెబ్బలు తిన్నవారినీ కొందరిని స్టేషన్‌కు తీసుకొచ్చినా, చివరకు వైద్యపరీక్షల కోసం తరలించిన పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోవాల్సిందిపోయి కేవలం కేసులు నమోదు చేసి వదిలేశారు. అయితే దాడి వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావటంతో తర్వాత తప్పనిసరై కేసు నమోదు చేశారని బాధితులు చెబుతున్నారు. ఇంతటి దారుణ పరిస్థితులు కనిపిస్తున్నా అధికార యంత్రాంగం మాత్రం ఎన్నికల వేళ ఇంకా మీనమేషాలు లెక్కించటం విమర్శలకు తావిస్తోంది.

నిబంధనలన్నీ ఎక్స్‌కవేటర్ చక్రాల కింద కప్పెట్టేసి...

ఇసుక రీచ్‌లలో ఇసుక తవ్వాలంటే దానికి వాల్టా చట్టం నుంచి గ్రీన్‌ట్రిబ్యునల్ నిబంధనల వరకు పాటించాలి. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఇవే మీ వర్తించవు. ప్రస్తుతం ఏ రీచ్‌లో ఇసుక తవ్వాలన్నా కేవలం కూలీలు, యంత్రాలతో భారీ ఎక్స్‌కవేటర్లు ఉపయోగించకూడదు. ట్రాక్టర్ల వంటి చిన్న వాహనాలతో మాత్రమే తరలించాలి. కనీసం ఆరు చక్రాల లారీలను కూడా దింపటానికి వీలులేదు. కేవలం 6 మీటర్ల లోతులో మాత్రమే ఇసుక తవ్వకాలు జరగాలి. మైనింగ్ శాఖ అనుమతిచ్చిన ప్రదేశంలో మాత్రమే తవ్వకాలు జరపాలి. అనుమతించిన పరిమాణంలో తప్ప అధికంగా తవ్వకూడదు. కనీసం నీటి చెమ్మ కూడా బయటకు కనిపించేలా తవ్వటానికి వీలులేదు. నది ప్రవాహం ఉన్న పాయ వెంట ఇసుక తవ్వకాలు జరపటానికి వీలులేదు. నీటి అడుగున తవ్వకాలు జరిపే పరిస్థితి ఉండకూడదు. కానీ ఇక్కడ ప్రభుత్వ నిబంధనలు పూర్తిగా విస్మరిస్తున్నారు. ఎంత పరిమాణం? ఎక్కడెక్కడ తియ్యవచ్చనేది అధికారులు నిర్ణయించిన ప్రకారమే డ్రెడ్జర్లతో తియ్యాలి. ఇవి కాకుండా మరిన్ని కఠిన నిబంధనలు చాలానే ఉన్నా ఇవేమీ ఇక్కడ పనిచెయ్యవు. ఈ ప్రాంతాల్లో ఏ రీచ్‌కూ పర్యావరణ, ఇతర అనుమతులు లేవని, నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయంటూ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఇసుక రీచ్‌లన్నిటినీ ఆపేయాలని ఎప్పుడో ఆదేశాలిచ్చింది. నిబంధనల మేరకు తవ్వకాలు జరిగింది, లేనిదీ నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తే, కలెక్టర్లే అవేమీ లేవని నివేదికివ్వటం ఇక్కడ దందా వెనుకున్న అక్రమార్కులు అండను నిదర్శనం. ఒక్క రీచ్‌లో కూడా కనీసం కూడా లేకపోయినా అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ఏకంగా భారీ ఎక్స్‌కవేటర్లు తీసుకొచ్చి మరీ ఇసుక తవ్వేస్తున్నారు. పైగా ఇసుక మేటవేసిన మందాన్ని బట్టి అడుగు నుంచి మూడు అడుగుల లోతులో తవ్వాల్సి ఉన్నా మీటర్ల కొద్దీ తవ్వేస్తున్నారు.

సమాచారం కావాలంటే ఆర్టీఐ పెట్టండి...

గుంటూరు జిల్లాలో ఏ రీచ్‌కు అనుమతులున్నాయో! ఎక్కడెక్కడ తవ్వకాలు జరపొచ్చనే సమాచారం కావాలన్నా, వాటి తర వివరాలు కావాలన్నా ఒక ఆర్టీఐ పెట్టాల్సిందే. సామాన్యులైనా, మరెవరైనా ఇదే నిబంధన. మున్నంగి రీచ్‌లో అక్రమ తవ్వకాల విషయం ఏమీ లేదు. ఒకవేళ అనుమతించిన ప్రదేశంలో కాకుండా అక్రమంగా మరెక్కడైనా తవ్వుతున్నారని అనుమానం ఉంటే వారికి ఇచ్చిన అనుమతి పత్రంలో అక్షాంశ, రేఖాంశాలుంటాయి. జీపీఆర్‌ఎస్ ద్వారా మీరే పరిశీలించుకోవచ్చు. నిబంధనల అతిక్రమణ జరగటంలేదు. యంత్రాల వినియోగం విషయం పరిశీలిస్తాం.

- జిల్లా మైనింగ్ అధికారి చంద్రశేఖర్

పోలీస్, సెబ్ శాఖలు

కొందరు అధికారులు వత్తిడులకు రీచ్‌లలో ఏం జరిగినా వారికి సంబంధం లేదన్నట్టు ఉంటారు. మరికొందరు రెండు, మూడు రీచ్‌లలో మాత్రం చాలవరకు కట్టడి చేస్తున్నాం అనిపిస్తున్నారు. ఇంకొందరయితే అవేమీ మాకు సంబంధం లేదన్నట్టు లారీ యజమానుల దగ్గర నుంచి నెలవారీ మామూళ్లకు వాట్సప్ గ్రూపులు పెట్టి మరీ వసూళ్లు చేసేస్తున్నారనేది లారీ యజమానుల ఆరోపణ.

భూగర్భ 'ఘనుల' శాఖ

ఇసుక తవ్వకాలకు అనుమతులివ్వాలి కాబట్టి మారు మాట్లాడకుండా ఇచ్చేస్తారు. వారు అనుమతించిన చోట తవ్వుతున్నారా? లేక అక్రమంగా ఇతర ప్రదేశాల్లో తవ్వేస్తున్నారా అనేది చూసేందుకు రీచ్‌లలో అడుగు పెట్టటానికి కూడా సాహసించరు.

భూగర్భ జలవనరుల శాఖ

నదుల్లో ఇసుక తవ్వకాలకు నేతలు, వారి అనుచరులు ఎక్కడ అడిగితే అక్కడ 'నో అబ్జెక్షన్' అంటూ అనుమతులు ఇవ్వాల్సిందే. నీరు బయటపడేలా వాల్టా నిబంధనలకు విరుద్ధంగా భారీ లోతుల్లో తవ్వేస్తున్నా భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని నదీ తీరవాసులు గొంతెత్తి అరుస్తున్నా, వీరికేమీ వినిపించవు.

పర్యావరణం, నీటిపారుదల శాఖ


ఈ శాఖలకు ఇక్కడ చోటేలేదు. వారిని కాగితాలపై సంతకాల వరకే పరిమితం చేశారు. జిల్లాల కలెక్టర్లతో రీచ్‌లను స్వయంగా పరిశీలిస్తున్నా, అటువైపు కన్నెత్తికూడా చూడకుండా అంతా బ్రహ్మాండంగా ఉందని, ఎక్కడా అక్రమ తవ్వకాలే జరగటంలేదని ఏకంగా జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌కే నివేదికలిచ్చేస్తారు.

● ఇదీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాల దందా వెనుక జరుగుతున్న లోగుట్టు. కింది స్థాయి అధికారి నుంచి జిల్లాల పాలనాధికారుల వరకు రీచ్‌లలో జరుగుతున్నది అక్రమమే అని తెలిసినా, మారు మాట్లాడే సాహసం కూడా చేయకుండా నేతలకు జీ హుజూర్ అంటూ అధికారులే చేతులెత్తేస్తుండటం విచిత్రమే.

కొన్నిచోట్లయితే 10 నుంచి 18 అడుగుల లోతులో గుంతలు పడేలా ఇసుక తవ్వేస్తున్నారు. ఇసుక పొర కింద నీరు బయటకు కనిపించటమే.. కానీ నీరు బయటకు వచ్చినా దానిలోనూ వదులుగా ఉన్న వరకు ఇసుక తవ్వేస్తున్నారు. నిరంతరం ఆవిరై, భూగర్భ జలాలు అడుగంటిపోవటానికి కారణమవుతోంది.

అధికారులకు చిత్తశుద్ధి కరువు..

అధికారులు నిజంగా చిత్తశుద్ధితో తవ్వకాలను పర్యవేక్షిస్తున్నారనుకుంటే, ఒక్క రీచ్‌లో కూడా పొక్లెయిన్ లేకుండా మొత్తాన్ని సీజ్ చేసేవారే. కానీ ఎక్కడా జరిమానాలు విధించటం లేదు. ఒక్కో రీచ్‌లో కనీసం మూడు నుంచి ఆరుకుపైగా భారీ పొక్లెయిన్లు ఇసుక తవ్వేస్తున్నాయి. అధికారిక, అనధికార రీచ్‌లన్నీ లెక్కేస్తే బ్యారేజీ ఎగువన, దిగువన మొత్తం 100కుపైగా భారీ పొక్లెయిన్లు కృష్ణానదిని తోడేస్తున్నాయి. కనీసం వీటిని కట్టడి చేసేనా కొంతైనా అక్రమాలు తగ్గే అవకాశం ఉంటుంది. తాజాగా మరోమారు జిల్లాల కలెక్టర్లు రీచ్‌ల బాట పట్టనున్నారనేది సమాచారం. అప్పటికైనా గత పరిశీలనల్లా కాకుండా అక్రమ తవ్వకాలపై ఆరా తీస్తే తీరవాసుల గొంతెండే పరిస్థితికి ఉపశమనం లభిస్తుంది.



● తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు

పరిమితికి మించి లారీలో ఇసుక

చంద్రబాబు ప్రజాగళం నేడే

- బాపట్ల పట్టణంలో రోడ్‌షో నిర్వహణ
- అంబేడ్కర్ కూడలిలో బహిరంగ సభ
- తరలిరానున్న టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు
- రాత్రికి బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బస

బాపట్ల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆదివారం బాపట్లలో ప్రజాగళం సభ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను టీడీపీ నేతలు ఇప్పటికే పూర్తి చేశారు. శ్రేణులను సమాయత్తం చేసే కార్యక్రమంలో భాగంగా బాపట్లలోని టీడీపీ కార్యాలయంలో కూటమి నేతలు శుక్రవారం సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఎన్నికల మేన్యూఫెస్టో విడుదలైన తర్వాత ప్రచారం కోసం తొలిసారి చంద్రబాబు జిల్లాకు రానుండడంతో అధినేతను ఘన స్వాగతం పలికేందుకు తెలుగుదేశం నేతలు సిద్ధమయ్యారు. జిల్లా కేంద్రం కావడం, అందునా బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం కూడా కావడంతో పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి టీడీపీ శ్రేణులు తరలివచ్చే అవకాశం ఉంది. దీనికి తోడు బీజేపీ, జనసేన పొత్తులో ఉన్నందున ఆ పార్టీల మద్దతుదారులు కూడా భారీ సంఖ్యలో హాజరు కానున్నారు. అంతేకాకుండా పాలకపార్టీ వైఖరిపై విసిగిపోయి ఉన్న సామాన్య ప్రజలు సైతం స్వచ్ఛందంగా చంద్రబాబు ప్రజాగళం సభకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. తీరు మారని వైసీపీ శ్రేణులు వచ్చేందుకు సిద్ధమని చెప్పటం విశేషం. చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి పెద్దఎత్తున చేరికలు కూడా ఉండనున్నాయి. అప్పికట్ల సర్పంచ్‌తో పాటు మరికొంత మంది వైసీపీ నాయకులు అధినేత సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారని తెలుస్తోంది.

టీడీపీలో జోష్...

ప్రజాగళం సభ కోసం టీడీపీ అధినేత చంద్రబాబు బాపట్లకు రానుండడంతో టీడీపీలో జోష్ కనబడుతోంది. పొత్తు పొడిచాక జరుగుతున్న తొలి సభ కావడంతో కూటమి ఉమ్మడి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా చంద్రబాబు ప్రచారం చేపట్టనున్నారు. వైసీపీ దుర్మార్గ పాలన అంతమొందించడమే లక్ష్యంగా అధినేత చేపట్టిన ప్రజాగళం సభను విజయవంతం చేయాలని టీడీపీ నేతలు ప్రజలకు పిలుపిచ్చారు. ఈ సభ ద్వారా ప్రజలను మరింత చైతన్యపరచడంతో పాటు పాలకపార్టీ అరాచకాలను జనానికి వివరించనున్నారని ప్రతిపక్ష పార్టీ నేతలు చెబుతున్నారు.

చంద్రబాబు పర్యటన సాగేదిలా...

హెలిప్యాడ్‌లో ఆదివారం సాయంత్రం చంద్రబాబు దిగనున్నారు. అక్కడ నుంచి 216 జాతీయ రహదారి మీదుగా రోడ్‌షో చేపట్టనున్నారు. కుక్కలవారిపాలెం, దరివాదకొత్తపాలెం మీదుగా పట్టణంలోని జమ్ములపాలెం ఆర్‌వోబీ వద్దనున్న అంబేద్కర్‌కూడలి వద్దకు చేరుకోనున్నారు. సాయంత్రం 5.30కు ప్రజాగళం బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి చంద్రబాబు మాట్లాడనున్నారు. రాత్రికి ఇంజనీరింగ్ కళాశాలలోనే బస చేయనున్నారు.

లోటుపాట్లపై సమీక్ష

టీడీపీ అధినేత చంద్రబాబు రాత్రికి బాపట్లలోనే బస చేయనున్న దృష్ట్యా సోమవారం ఉదయాన్నే ఆయా నియోజకవర్గాల అభ్యర్థులతో పార్టీ పరిస్థితిపై సమీక్షించనున్నారని సమాచారం. ముఖ్యంగా చేపట్టాల్సిన కార్యక్రమాలతో పాటు కూటమి నేతలతో సమన్వయంపై నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. వైసీపీ వేధింపులతో పాటు ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు, ఓట్ల అక్రమాల వంటివాటిని సమీక్షలో చర్చకు రానున్నాయని తెలుస్తోంది.

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన



హెలిప్యాడ్ ఏర్పాటును పరిశీలిస్తున్న టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కృష్ణప్రసాద్, వేగేశన

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(ఆదివారం)
సహెరి (ఉదయం) 4.46 (సోమవారం)

ఒక్క ఇంటికీ.. దిక్కులేదు

● వైసీపీ పాలనలో పేదవారి సొంతింటి కల దూరం

పిడుగురాళ్ల, మార్చి 30: పేదవారి సొంతింటి కల నెరవేరుస్తామంటూ ఊదరగొట్టుడు ప్రచారం చేసిన వైసీపీ నేతలు అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని మరిచారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో టీడీపీ హయాంలో సుమారు 4 వేలకు పైగా గృహాలు అప్పటి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కృషితో మంజూరయ్యాయి. వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్మించే విధంగా పిడుగురాళ్ల సమీపంలో సుమారు 10 ఎకరాలను కేటాయించారు. 2017లోనే భూమిపూజ చేసిన అనంతరం ఇళ్ల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. పిడుగురాళ్ల పట్టణంలో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ సొంతింటి కల నెరవేర్చేందుకు యరపతినేని లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగింది. మంజూరైన 4 వేల గృహాలకు గాను 300 గజాలలో 2,016, 365 గజాల విస్తీర్ణంలో 816 గృహాలను 2019 ఎన్నికలకు ముందే సుమారు 80 శాతంకు పైగా నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఎన్నికల అనంతరం వైసీపీ పాలన వచ్చాక అప్పటి లబ్ధిదారుల జాబితాలో వైసీపీ నేతల అనుచరులు, ఆయా సానుభూతిపరులను పెద్దపీట వేస్తూ జాబితాను మార్చేశారు.

రివర్స్ టెండరింగ్‌తో ఐదేళ్లుగా పనులు నిలిపివేత

పిడుగురాళ్లలో టిడ్కో గృహాల నిర్మాణం చేస్తున్న షాపోజి పల్లంజి సంస్థ కొన్నాళ్ల వరకు పనులు చేయకుండా స్థానిక నేతలు ఒత్తిడి తేవడంతో సదరు కాంట్రాక్టర్ సామాగ్రిని సహా తరలించుకుపోయారు. రివర్స్ టెండరింగ్ పేరుతో వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో టిడ్కో గృహాల నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. తిరిగి ఏదావిధి పనులు పునఃప్రారంభం కాకుండా నత్తనడకన సాగుతున్నాయి.



పిడుగురాళ్లలోని టిడ్కో గృహాలు

వద్దన్నా రుణాలు..

టిడ్కో గృహాలు మంజూరైన మహిళలు పొదుపు సంఘంలో ఉన్నవారందరికీ రుణాలను బలవంతంగా అంటగట్టారు. 365 చదరపు గజాల విస్తీర్ణంలో 816 మంది మహిళలకు రూ.5,07,64,000 వివిధ బ్యాంకుల ద్వారా రుణాలను మహిళలకు ఇచ్చారు. నిబంధనల ప్రకారం గృహ నిర్మాణాలు పూర్తయి ప్రవేశాలు జరిగాకే తీసుకున్న రుణాలకు వాయిదాలు చెల్లించాలి. అయితే రుణాలు తీసుకున్న కొన్ని నెలలకే మహిళల పొదుపు బ్యాంకర్లు మెసేజ్‌లు పంపడంతో పాటు నోటీసులు అందించి వాయిదాలు చెల్లించాలని చెప్పారు. ఒక్కో మహిళకు రూ.3,15,000 రుణం మంజూరు కాగా, మొదటి విడతగా రూ.2,30,000 రుణంగా ఇచ్చి మిగిలిన రూ.85,000 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక రెండవ విడత జమకావాల్సి ఉంది. తీసుకున్న రుణాలపై రెండేళ్ల మారటోరియం ఉన్నా బ్యాంకర్లు రుణాలిచ్చిన కొన్నాళ్లకే చెల్లింపులపై ఒత్తిడి తీసుకొచ్చారు. రివర్స్ టెండరింగ్ పేరుతో వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాల నిర్మాణాలు నిలిపివేయడంతో సొంతింటి కల నెరవేరక పలువురు లబ్ధిదారులు వైసీపీ ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

సాగర్ చెంత.. నీటికి చింత


తాగునీటికోసం మండుటెండలో మహిళల అవస్థలు

మాచర్ల టౌన్, మార్చి 30: మాచర్ల మండలం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ సమీపంలోని లంకమోడులో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. 15 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రంజాన్‌మాసం కావడంతో ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు తాగునీటి కష్టాలు పరీక్ష పెడుతున్నాయి. అరకొరగా వచ్చే కొద్దిపాటి నీటిని బేసిన్ అడ్డుగా పెట్టి మహిళలు బిందెలలో నింపడం కాలనీలో తీవ్ర నీటి ఎద్దడికి అద్దం పడుతోంది. కులాయిల్లో అరకొరగా వచ్చే ఆనీటిలోనూ మట్టి, మురుగు, గుడ్డ ముక్కలు వస్తున్నా ఆ నీటిని తాగుతున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాలకృత్యాలకు సైతం క్యాన్‌నీరు కొనుక్కోవాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మండుటెండలో ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు తాగునీటి సమస్య సవాలుగా మారింది. సమస్యపై ఎన్నిమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదంటూ మహిళలు వాపోతున్నారు.

యువత భవితను నిర్దేశించే ఎన్నికలివి

- ఆచితూచి నిర్ణయం తీసుకోవాలి
- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు. పాల్గొన్న ఎంపీ లావు, మాజీ ఎమ్మెల్యే యరపతినేని తదితరులు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 30: ప్రస్తుతం జరగబోతున్న ఎన్నికలే రాష్ట్ర యువత భవితను నిర్దేశించ బోతున్నాయని, ప్రజలంతా ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి చేశారు. శనివారం పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ప్రైవేట్ ఉపాధ్యాయులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ప్రత్తిపాటితో పాటు నరసరావుపేట పార్లమెంట్, లావు శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడుతూ అసమర్థ పాలనలో యువత చదువుకున్న చదువులు నిరర్థకంగా మారాయని, ఇందుకు జగన్ ఏలుబడే ఉదాహరణ అన్నారు. వైసీపీ ప్రభుత్వ తీరుపై ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, సిబ్బంది పూర్తి అసంతృప్తిగా ఉన్నాయన్నారు. రాజధాని నిర్మాణం కావాలన్నా, పోలవరం పూర్తి కావాలన్నా, ఏటా డీఎస్సీ క్రమంతప్పని జాబ్ నోటిఫికేషన్‌లతో యువతకు మంచి భవిష్యత్ కావాలంటే తెలుగుదేశం కూటమితోనే సాధ్యమన్నారు. చిలకలూరిపేటను అన్ని విధాలా అభివృద్ధి చేసిన తనతో పాటు ఉన్నత విద్యాసంస్థలు నిర్వహిస్తున్న లావు శ్రీకృష్ణ దేవరాయలను బలపరచాలని ప్రత్తిపాటి కోరారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ చిలకలూరిపేట అభివృద్ధి చేసింది ఎవరు?, నరసరావుపేట ఎంపీగా నేనే చేశాను.. ఎవరైతే ప్రజలకు అందుబాటులో ఉంటారో, అభివృద్ధికి పాటుపడతారో ఆలోచించి ఓటు వేయాలన్నారు. అనంతరం యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్ ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రం ఎంతో నష్టపోయిందని, విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని, రాష్ట్ర ప్రయోజనాలు వదిలేసి, సొంత ప్రయోజనాలే అజెండాగా పాలన సాగించారని ధ్వజమెత్తారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే పార్లమెంట్ అభ్యర్థి లావుకు, శాసనసభ అభ్యర్థి ప్రత్తిపాటికి మద్దతుగా నిలవాలన్నారు.

మూడు రాజధానులంటూ ముంచారు

- 1565వ రోజుకు ఆందోళనలు


బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం రైతు ధర్నా శిబిరాలలో ఆందోళన చేస్తున్న మహిళలు

తుళ్ళూరు, మార్చి 30: రాష్ట్ర రాజధాని అమరావతికి ప్రభుత్వం భూములు అడిగితే 33వేల ఎకరాలు ఇచ్చామని, అభివృద్ధి కొనసాగుతున్న తరుణంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు రాజధానులని రాష్ట్ర ప్రజలను అయోమయానికి గురి చేసిందన్నారు. మూడు రాజధానులు వద్దు మొదట భారతదేశ పటంలో పేర్కొన్న రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతిని అభివృద్ధి చేయాలన్నారు. అమరావతి రాష్ట్ర సంపద అని తెలిసినా సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కలాటతో అమరావతిని నాశనం చేయటం ప్రారంభించారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1565వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి, వారి వారి ఇళ్ల వద్ద నుంచి పులువురు రైతులు నిరసనలు, దీక్షలు చేశారు. సొంత ప్రయోజనాల కోసం మూడు రాజధానులు అని సీఎం జగన్‌రెడ్డి భూములిచ్చిన రైతులను నట్టేట ముంచే క్యాక్రమం తలపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

ఉద్యోగం అక్కడ.. విధులు ఇక్కడ

- నెల్లూరు జిల్లా ఉద్యోగి రేపల్లె తహసీల్దారు కార్యాలయంలో విధులు
- ఇక్కడ చక్రం తిప్పుతున్నవైనం


రేపల్లె తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏ షేక్ షరీఫ్


తహసీల్దారు రవీంద్రబాబు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న నెల్లూరు జిల్లా ఇంజిమూర్ మండలం ఓటుకూరు గ్రామం వీఆర్ఏ షరీఫ్

రేపల్లె, మార్చి 30: ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాల్సిన ఓ ప్రభుత్వ ఉద్యోగి అందుకు విరుద్ధంగా తనపై అధికారి ఎక్కడికి బదిలీ అయితే అక్కడకు వెళ్ళి అనధికారికంగా ఆయనకు డ్రైవర్‌గా వ్యవహరిస్తూ అధికారిక వ్యవహారలన్నింటినీ చక్కబెడుతూ జేబులు నింపుకుంటున్నాడు. నెల్లూరు జిల్లా ఇంజిమూరు తహసీల్దారుగా విధులు నిర్వహించిన టి.రవీంద్రబాబు ఎన్నికల దృష్ట్యా జనవరి నెలలో రేపల్లె తహసీల్దారుగా బదిలీపై వచ్చారు. నెల్లూరు జిల్లా ఇంజిమూరు మండలం ఉంగుటూరు గ్రామం వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్న షేక్ షరీఫ్ ఆయన వెంటే ఉండేవారు. తహసీల్దారు వెంటే ఇక్కడకు వచ్చి వ్యవహారాలన్నీ చక్కబెడుతూ తాను జేబులు నింపుకుంటున్నాడు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.

ఆరుగురు వేమెన్‌ల లైసెన్స్‌ల సస్పెన్షన్

గుంటూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలతో మిర్చియార్డులో నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారం చేయించిన వేమెన్ అసోసియేషన్ నాయకులను మార్కెటింగ్‌శాఖ జేడీ కాకుమాను శ్రీనివాసరావు సస్పెన్షన్ చేశారు. ఈ నెల 22వ తేదీన మిర్చియార్డులోని వేమెన్ అసోసియేషన్ కార్యాలయంలో వైసీపీ నేతలతో అసోసియేషన్ నాయకులు సమావేశం ఏర్పాటుచేయించి వైసీపీకి మద్దతు ఇవ్వాల్సిందిగా అభ్యర్థించారు. ఈ సమావేశంలో క్రియాశీలకంగా వ్యవహరించిన వేమెన్‌లు గోరంట్ల రాజగోపాల్, కొండా శ్రీనివాసరెడ్డి, లక్కిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ప్రత్తిపాటి కృష్ణప్రసాద్, కొటారి శ్రీహరిరావు, చల్లా కోటిరెడ్డిలను సస్పెన్షన్ చేశారు.

మహిళలు మనోధైర్యంతో ముందుకు వెళ్లాలి: పెమ్మసాని


విద్యార్థినులతో కలిసి అభివాదం చేస్తున్న పెమ్మసాని

గుంటూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కిరణ్ మజుందర్ షా, ఇంద్రా నూయి వలె మహిళలు మనోధైర్యంతో ముందుకు సాగాలని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పెద పలకలూరులోని విజ్ఞాన్ నిరుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్ ఫర్ విమెన్ కాలేజీలో శనివారం జరిగిన పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు భవిష్యత్తులో ఏ బాధ్యతలు చేపట్టినా ప్రతి అంశంలోను నెంబర్ వన్‌గా ఎదగాలని సూచించారు. తాను ఈరోజు ఇంత హుందాగా ఉండడానికి తన తల్లి, భార్య ప్రధాన కారణమని తెలిపారు. ఓటు హక్కు తొలిసారి ఉపయోగించుకునే ముందు మహిళలు ఒక్కసారి ఆలోచించి అభివృద్ధికి ఉపయోగపడే నాయకులను ఎన్నుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ మహిళలకు ఆస్తి హక్కును ఎన్టీఆర్ అందిస్తే చంద్రబాబు నాయుడు మహిళా సాధికారికతను అందించారని వివరించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కొర్రపాటి నాగేశ్వరరావు, సంస్థ డైరెక్టర్ కూర్మనాథం తదితరులు పాల్గొన్నారు. కాగా సెయింట్ మ్యాథ్యూస్ లూథరన్ చర్చ్‌లో శనివారం జరిగిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని పెమ్మసాని ప్రారంభించి పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ గుంటూరు తూర్పు, పశ్చిమ అభ్యర్థులు, పిడుగురాళ్ల మాధవి, మహమ్మద్ నసీర్, మేని తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి జంగా.. వైసీపీకి బిగ్ షాక్

- నేడు చేరనున్న ఎమ్మెల్సీ

నరసరావుపేట, మార్చి 30: జిల్లాలో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. వైసీపీకి బిగ్‌షాక్ తగలనుంది. ఆ పార్టీని వీడి సీనియర్‌లు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తెలుగుదేశం తీర్థం పుచ్చుకోనున్నారు. అయనతోపాటు గురజాల నియోజకవర్గంలోని పలువురు నేతలు వైసీపీని వీడి జంగాతో టీడీపీలో చేరనున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆదివారం జరగనున్న పర్యటనలో జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సమక్షంలో ఆయన పార్టీ చేరేందుకు ముహూర్తం ఖరారైంది. ఇప్పటికే ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలసి ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి చంద్రబాబుతో కలసి పార్టీలో చేరే అంశంపై చర్చలు జరిపారు. జంగా చేరికకు చంద్రబాబు అంగీకరించారు. మాజీ ఎమ్మెల్యే, గురజాల టీడీపీ అభ్యర్థి యరపతినేనితో కూడా చర్చలు జరిపారు. గురజాల నియోజకవర్గంలో ప్రత్యర్థులుగా ఉన్న జంగా, యరపతినేని ఇరువురు ఒకే పార్టీలో కలసి పనిచేయనున్నారు. ఈమేరకు చర్చలు సఫలమయ్యాయి. యరపతినేని విజయం కోసం జంగా కృషి చేయనున్నారు.

ఎన్నికల కోడ్ అమలులో వీడని నిర్లక్ష్యం


గాజుల్లంక సచివాలయం వద్ద నిర్మించిన దిమ్మెపై కనిపిస్తున్న జగన్ చిత్రం


గాజుల్లంకలో ఏర్పాటుచేసిన బెంచీలపై రాజకీయ నాయకుల పేర్లు

కొల్లూరు, మార్చి 30: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చి రెండు వారాలు అయిన దానిని అమలు పరచడంలో అధికారులు నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. మండలంలోని గాజుల్లంకలోని సచివాలయం ఎదురుగా నిర్మించిన సిమెంట్ దిమ్మెపై జగన్ చిత్రం కనిపిస్తోంది. పైగా గ్రామంలో పలు చోట్ల గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బెంచీలపై రాజకీయ నాయకులు పేర్లు కనిపించడం గమనార్హం. వాటికి కూడా ముసుగు వేయాల్సి ఉండగా సచివాలయ సిబ్బంది తమకేమీ సంబంధం లేనట్లుగా వదిలి వేశారు. ఎంపీడీవో లక్ష్మీకుమారి, తహసీల్దార్ పుల్లారావులు రెండుసార్లు సమావేశాలు ఏర్పాటుచేసి చెప్పినా గాజుల్లంక కార్యదర్శి చెవికి ఎక్కలేదేమో లేదా మారుమూల గ్రామం కదా ఎవరు చూస్తారులే అని నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారో వారికే తెలియాలి. ఇటీవల సర్పంచ్ ఇంటిపై ఉన్న హోర్డింగ్ తొలగించకపోవడంతో ఎంపీడీవో ఆ కార్యదర్శికి నోటీసులు ఇచ్చినా క్షేత్ర స్థాయిలో ఎన్నికల కోడ్ అమలు చేయడంలో నిర్లక్ష్యం వీడక పోవడం గమనార్హం.

పవన్ పర్యటనను విజయవంతం చేద్దాం

- జనసేన పీఏసీ చైర్మన్ మనోహర్


మార్కెట్ ప్రాంతంలో పవన్‌కల్యాణ్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మనోహర్

తెనాలి రూరల్, మార్చి 30: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెనాలి పర్యటనను విజయవంతం చేద్దామని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం స్థానిక మార్కెట్ ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 3న మునిసిపల్ మార్కెట్ ప్రాంగణంలో పురవేదిక వద్ద జరిగే పవన్‌కల్యాణ్ బహిరంగసభకు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పండ్ల వ్యాపారులతో ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం చేసే ఈ పోరాటంతో వ్యాపారులు, చిరు వ్యాపారులు కూడా తమవంతుగా సహకరించాలన్నారు. అన్నాబత్తుని జయలక్ష్మి, గౌరీశంకర్, పలువురు టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అధికారుల నిర్లక్ష్యం


పార్కు చేసి ఉన్న కారు, చెట్టుకింద కూర్చుని ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది

అమృతలూరు, మార్చి 30: ఎన్నికల సజావుగా జరిగేందుకు ఎన్నికల సంఘం కఠినచర్యలు తీసుకుంటున్నా కిందిస్థాయి సిబ్బందిలో నిర్లక్ష్యం వీడలేదు. అమృతలూరు, చుండూరు మండలాలకు సంబంధించి ఉమ్మడిగా ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటుచేశారు. ఈ స్క్వాడ్ గ్రామాల్లో తిరుగుతూ ఎన్నికల నియమావళి ఉల్లంఘన లేకుండా అక్రమంగా మద్యం, నగదు తరలింపులు అడ్డుకోవడం వంటి చర్యలు చేపట్టాలి. అలా చేయకుండా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కారు పార్కుచేసి సిబ్బంది చెట్టు కింద కూర్చున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది గ్రామాల్లో విస్తృత పర్యటనలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

యథేచ్ఛగా వైసీపీ కోడ్ ఉల్లంఘనలు

- పట్టించుకోని అధికార యంత్రాంగం


పెదనందిపాడులో సుచరిత ఫొటో, వైసీపీ రంగులతో దర్శనమిస్తున్న శిలా ఫలకం


విగ్రహాల వద్ద దర్శన మిస్తున్న వైసీపీ రంగులు

ప్రత్తిపాడు, మార్చి 30: ప్రత్తిపాడు ఎన్నికల అధికారులు ఇంకా అధికర పార్టీకి కొమ్ముకాస్తూనే ఉన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా వైసీపీ విషయంలో మాత్రం అధికార యంత్రాంగం మొత్తం చూసిచూడనట్టు పోతున్నారు. అందుకు ప్రత్యక్ష నిదర్శనమే పెదనందిపాడులో కనిపిస్తున్న ఈ దృశ్యాలు. పెదనందిపాడులో శిలాఫలకాలపై వైసీపీ రంగులు ఇంకా దర్శన మిస్తున్నాయి. అంతే కాకుండా ఆ శిలాఫలకంలో మేకతోటి సుచరిత ఫొటోలు ఉన్నాయి. విగ్రహాలు ఉన్న చోట సైతం పార్టీ రంగులు లేకుండా చేయాల్సి ఉంది. కాని విగ్రహాలకు అయితే ముసుగులు వేశారు కాని రంగులు మాత్రం అలాగే ఉంచారు. ఈ విషయంలో ఎన్నికల అధికారులు మాత్రం చూసీ చూడనట్టే వ్యవహరిస్తున్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువు పెంపు

తాడికొండ, మార్చి 30: రాష్ట్రంలోని ఏపీ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో చేరుటకు నిర్వహించి ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువు ఏప్రిల్ 5వ తేదీ వరకు పెంచటం జరిగిందని తాడికొండ ఏపీఆర్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ పి.జోగారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతిలో అన్ని సీట్లకు, 6, 7, 8 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి విద్యార్థులను నుంచి దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారికి ఏప్రిల్ 25వ తేదీన అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించ బడుతుందన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు నోటిఫికేషన్

తెనాలి అర్బన్, మార్చి 30: పట్టణంలోని జగ్గడిగుంటపాలెంలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయంలో రానున్న విద్యా సంవత్సరానికి గాను దరఖాస్తులు ప్రిన్సిపల్ శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు. బాలవాటిక, 1వ తరగతి, 2 నుంచి 9వ తరగతి వరకు ఏర్పడే ఖాళీలను అనుసరించి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. విద్యాలయంలో జనన ధ్రువీకరణ, ఆధార్ చూపి ప్రవేశ దరఖాస్తు పొందాలని తెలిపారు. 1వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని చెప్పారు. 11వ తరగతి ప్రవేశాలకు సీబీఎస్ఈ, స్టేట్ బోర్డు ఫలితాలు విడుదల అయిన 10 రోజుల్లో దరఖాస్తు పొందాలన్నారు. బాలవాటిక, 1వ తరగతి ప్రవేశ దరఖాస్తులను ఏప్రిల్ 15 లోగా అందించాలని, ఎంపికైన విద్యార్థుల జాబితాను ఏప్రిల్ 19న ప్రకటిస్తామన్నారు. వివరాలకు విద్యాలయంలో సంప్రదించాలన్నారు.

పల్నాడు వార్తలు



టీడీపీలో చేరినవారితో కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం మండలంలో వైసీపీకి బిగ్ షాక్

● వైసీపీ వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్న 60 కుటుంబాలు

రాజుపాలెం, మార్చి30 : రాజుపాలెం మండలంలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. శనివారం మండలంలోని రాజుపాలెం గ్రామ మాజీ సర్పంచ్‌లు పులిబండ్ల సాంబశివరావు, జెట్టి కోటేశ్వరరావు, జిల్లా పరిషత్ హైస్కూల్ మాజీ చైర్మన్ చౌక్కా రాంబాబు, పెద్దింటి శ్రీను ఆధ్వర్యంలో 60కుటుంబాలు వైసీపీ వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. 2019 ఎన్నికల్లో ప్రస్తుత మంత్రి అంబటి రాంబాబు విజయానికి తీవ్రంగా కృషి చేసిన కోట నెమలిపురి గ్రామానికి చెందిన పప్పుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఐదుగురు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరు ప్రస్తుతం అధికార ప్రజాప్రతినిధికి దగ్గరి బంధువులు కావటం విశేషం.

అనంతరం పులిచింతల పునరావాస కేంద్రంలో కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ఈ రాష్ట్రం ప్రజలకు ఎంతో కీలకమని తెలిపారు. రాష్ట్ర ప్రజలు అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీజిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, నియోజకవర్గ టీడీపీ నేలు డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, మాజీ ఎంపీపీలు నర్రా బాబురావు, గుత్తా వెంకట్రావు, రాష్ట్ర నాయకులు కొండ్రకుంట రంగారావు, మాజీ జెడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి, మండల తెలుగుమహిళ అధ్యక్షురాలు అహల్యారాణి, రామలక్ష్మణరావు, మొర్రిబోయిన వెంకటప్పయ్య, లంకా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి : రాజుపాలెం మండలం కోటనెమలిపురికి చెందిన వైసీపీ నేత పప్పుల శ్రీనివాసరెడ్డి శనివారం టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కన్నా లక్ష్మీనారాయణ శ్రీనివాసరెడ్డి, అతని అనుచరుడికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీనివాసరెడ్డికి టీడీపీలో తగిన ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. శ్రీనివాసరెడ్డి రాజుపాలెంకు చెందిన వైసీపీ జెడ్పీటీసీకి స్వయానా బంధువు. ఇప్పటికే కోట నెమలిపురిలో మెజార్టీ వైసీపీ నాయకులు, కార్యకర్తలు కన్నా సమక్షంలో టీడీపీలో చేరారు.

ముప్పాళ్ళ : మండలంలోని దమ్మాలపాడులో శనివారం రామాలయం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సత్తెనపల్లి : పట్టణంలోని పాత శివాలయం సెంటర్‌లో శ్రీకోటేశ్వర స్వామి దేవస్థానంకు శనివారం భూమి పూజ కార్యక్రమంలో కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఆయనతో కూటమినేతలు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

రాజుపాలెం: మండలంలోని ఆకులగణపవరం గ్రామంలో కొలువైయున్న ప్రసన్నాంజనేయ స్వామి వారి 95వ జయంతి మహోత్సవంలో కన్నా లక్ష్మీనారాయణ, ఆయన కుమారుడు ఫణీంద్ర పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు

కారంపూడి, మార్చి 30: పట్టణంలోని మిట్టమీదపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. 41 శనివారాలు పాటు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కొమండూరు సత్యనారాయణ చార్యులు తెలిపారు. కరాలపాటి ఆదినారాయణ దంపతులు అభిషేకాలను ప్రారంభించారు. చారిత్రక ప్రసిద్ధి గాంచిన ఈ ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్నారు.

నేడు వడ్డెరల ఆత్మీయ సమ్మేళనం

మాచర్లటౌన్, మార్చి 30: పట్టణంలోని నరిశెట్టి కల్యాణ మండపంలో ఆదివారం వడ్డెర సామాజిక వర్గీయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సమ్మేళనానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి హాజరవుతారన్నారు. వడ్డెర సంఘీయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో కొమెర అనంతరాములు, ఉప్పుతోళ్ల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వర్లు, అంజి తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీని విజయవంతం చేయండి

రెంటచింతల,మార్చి 30 : మండల కేంద్రమైన రెంటచింతలలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం టీడీపీ జయహో బీసీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మాచర్ల నియోజకవర్గ బీసీ సాధికారిక కన్వీనర్ నారాయణపురం శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి హాజరవుతారన్నారు. బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



సూపర్ 6 పథకాలను వివరిస్తున్న జూలకంటి గౌతమ్‌రెడ్డి

బతుకులు మారాలంటే బ్రహ్మారెడ్డి రావాలి

● ఎన్నికల ప్రచారంలో బ్రహ్మారెడ్డి తనయుడు గౌతమ్‌రెడ్డి

వెల్దుర్తి, మార్చి 30: మాచర్ల నియోజకవర్గంలో బానిస బతుకులు మారాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిని గెలిపించుకోవాలని బ్రహ్మారెడ్డి తనయుడు గౌతమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వజ్రాలపాడు పంచాయతీ దావుపల్లిలో సూపర్ 6 పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వెల్దుర్తి మండల పరిధిలో ఎన్నో గ్రామాలకు అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. కనీసంగా సరైన రహదారులు, తాగునీటి వసతి కూడా లేదన్నారు. గ్రామాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి బాట పట్టించాలంటే బ్రహ్మారెడ్డితోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో బ్రహ్మారెడ్డి ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు మల్లయ్య, టీడీపీ నేతలు వజ్రం నాయక్, కళ్లం రామాంజిరెడ్డి, పులుసు శివారెడ్డి, బీజేపీ నేతలు గండూరి మల్లికార్జున పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం

● బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ నేతలు

మాచర్లటౌన్, మార్చి 30: కూటమి నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు, మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిలను గెలిపించుకుందాం.. పల్నాట అభివృద్ధి సాధించుకుందామని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని 20వ వార్డులో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నరసరావుపేట ఎంపీగా శ్రీకృష్ణదేవరాయలు ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. మరోమారు ఆయనకు అవకాశమిచ్చి మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. అలాగే బ్రహ్మారెడ్డికి ఒక్క ఛాన్స్ ఇచ్చి నియోజకవర్గ అభివృద్ధికి పునాది వేసుకుందామన్నారు. ఇంటింటికి తిరిగి సూపర్ 6 పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో యెనుముల కేశవరెడ్డి, నర్రా గురవారెడ్డి, విద్యాధరణి మురళి, మాదినేటి శాంతి, ఖమ్మంపాటి చంటి, తిక్కా కొండలు, మంజుల అంజి, కొమర శివ, బొట్టు కోటేశ్వరరావు, నక్షత్రపు ప్రసాద్, కృష్ణవేణి, సంతోష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో అందరికీ లబ్ధి

● ఎన్నికల ప్రచారంలో గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని



సూపర్ సిక్స్ పథకాలను మహిళలకు వివరిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మార్చి 30: సూపర్ సిక్స్ పథకాలతో అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శనివారం పట్టణంలోని 8వ వార్డులో 'బాబు సూపర్ సిక్స్' పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా స్థానిక మహిళలు యరపతినేనికి హారతులిస్తూ స్వాగతం పలికారు. అనంతరం కొందరు సుగాలీలు లేగ ఆవుదూడను యరపతినేని శ్రీనివాసరావుకు కానుకగా అందజేశారు. అనంతరం బాబు సూపర్ సిక్స్ పథకాలను యరపతినేని శ్రీనివాసరావు ఇంటింటికి తిరిగి వివరించడంతో పాటు కరపత్రాలను అందజేశారు. టీడీపీ హయాంలో 8వవార్డులో చేసిన అభివృద్ధి, ప్రధాన సైడ్ డ్రెయిన్స్ నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. వైసీపీ పాలనలో అభివృద్ధి ఏమీ లేకపోగా ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ మరోచాన్స్ లేకుండా ఇంటిదారి పట్టేందుకు టీడీపీకి గెలిపించాలన్నారు. ప్రతి ఒక్కరు చంద్రబాబు నాయకత్వాన్ని బలపరుస్తూ గురజాలలో తనకు, ఎంపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలకు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. మహిళలకు వందనం, ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత పథకంతో పాటు ప్రభుత్వం అందించే ఏడాదికి మూడు సిలిండర్లు కాకుండా ఐదేళ్లలో ఇంటికొక సిలిండర్‌ను తాను వ్యక్తిగతంగా అందజేస్తానని యరపతినేని శ్రీనివాసరావు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో తమకు జరిగిన లబ్ధిని యరపతినేనికి తెలియజేస్తూ తామంతా మీవెంటే వుంటామంటూ పలువురు సుగాలీ మహిళలు తెలిపారు. అనంతరం గోశాలను సందర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు, కనిగిరి శ్రీను, గుదే గానసతీష్, దియ్య రామకృష్ణ, ఎల్‌వీఆర్, బీ.శ్రీను, జే.శ్రీను, బుజ్జి, సయ్యద్ అమీర్‌అలి, రంగానాయక్, బాబావలి, వడ్డవల్లి సాంబశివరావు, కామిశెట్టి రమేష్, ఖాశింసైదా, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు..

పట్టణ పరిధిలోని లెనిన్‌నగర్ ప్రాంతానికి చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి యరపతినేని శ్రీనివాసరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మల్లెల ఆదినారాయణ, బత్తుల శ్రీను, ఎల్‌వీఆర్, దేవళ్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాచవరం : మాచవరంలోని ఎస్సీ కాలనీకి చెందిన సుమారు 15 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో పసుపు కండువాలు కప్పుకొని టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో షేక్ హసన్‌వలి, తాడిగిరి ఆంజనేయులు, కొర్రపాటి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



యరపతినేని సమక్షంలో టీడీపీలో చేరిన మాచవరం ఎస్సీ కాలనీవాసులు



రెంటచింతలలో కవాతు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

నిర్భయంగా ఓటు వేయండి

రెంటచింతల,మార్చి 30 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకుని ప్రశాంత వాతావరణం ఏర్పడడానికి సహకరించాలని ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి కోరారు. శనివారం మండలంలోని సమస్యాత్మకమైన రెంటాల, మంచికల్లు, మిట్టగుడిపాడు, రెంటచింతల తదితర గ్రామాల్లో సివిల్ పోలీసులు, సీఐఎస్ఎఫ్(సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీఫోర్స్)తో కలిసి కవాతు నిర్వహించారు. ఎటువంటి అల్లర్లు లేకుండా ఓటును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ ఏఎస్ఐ వైకుంఠం పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

దాచేపల్లి, మార్చి 30: ఓటర్లంతా వారి ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని దాచేపల్లి తహసీల్దార్ గీతావాణి కోరారు. శనివారం దాచేపల్లిలోని ప్రధాన రహదారిలో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కు వినియోగం గురించి ప్రజలకు వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఫారం-6 ద్వారా తమ ఓటును నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ వెంకట సూర్యనారాయణరావు, ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈవో పినాకపాణి, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది విజయకుమార్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నూతన శాఖను ప్రారంబిస్తున్న చైతన్య గోదావరి బ్యాంకు ఆర్ఎం శ్రీనివాస్

మాదలలో సీజీబీసీ శాఖ ప్రారంభం

ముప్పాళ్ళ మార్చి 30: మండలంలోని మాదల గ్రామంలో ఏర్పాటు చేసిన చైతన్య గోదావరి బ్యాంకు శాఖను బ్యాంకు రీజనల్ మేనేజర్ చిరుమామిళ్ళ శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదలలోని శాఖ మొత్తంగా 265వ బ్యాంకు శాఖ కాగా, నరసరావుపేట డివిజన్లో 69వ శాఖ అని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రాజేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

పిడుగురాళ్ల, మార్చి 30: దేవరంపాడు నేతివెంకన్నస్వామి దేవాలయం వద్ద శనివారం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని యరపతినేని నిఖిల్ ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేస్తున్న సేవా సంస్థలు, వ్యాపార సంస్థలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి శ్రీను, కామిశెట్టి రమేష్, సేవా సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రక్షణచట్టంతో విప్లవాత్మక మార్పు

దాచేపల్లి, మార్చి 30: బీసీ డిక్లరేషన్‌లో భాగంగా బీసీలకు రక్షణ చట్టం ద్వారా ఎంతో విప్లవాత్మక మార్పును తీసుకురావున్ని గురజాల నియోజకవర్గ బీసీ నేతు బొమ్మనబోయిన నాగరాజుయాదవ్ తెలిపారు. శనివారం నారాయణపురంలోని టీడీపీ కార్యాలయంలో నాగరాజు అధ్యక్షతన బీసీ డిక్లరేషన్‌పై సమావేశం నిర్వహించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన జయహో బీసీ డిక్లరేషన్‌లో పలు అంశాలు బీసీలకు మరింత ఆత్మవిశ్వాసాన్ని కలిగించాయన్నారు. రానున్న ఎన్నికలలో బీసీలు ఐక్యంగా వుండి టీడీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర బీసీసెల్ నేత అక్కినపల్లి బాలయ్య మాట్లాడుతూ టీడీపీ తొలినాటి నుండి బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచిందని వివరించారు. సమావేశంలో ముశ్యం శ్రీనివాసరావు, బత్తుల రాంబాబు, తేలుకుట్ల బాలయ్య, వేముల కృష్ణ, భూమా వెంకటేశ్వర్లు, గాలం వెంకటేష్, మంచి రామరాజు, బత్తుల ఏడుకొండలు పాల్గొన్నారు.



సున్నం పరిశ్రమల యజమానులతో మాట్లాడుతున్న యరపతినేని నిఖిల్

సున్నం వ్యాపారులతో నిఖిల్ భేటీ

పిడుగురాళ్ల, మార్చి 30: శనివారం ఉదయం గుడ్‌మార్నింగ్ చాయ్ కార్యక్రమంతో యరపతినేని నిఖిల్ సున్నం బట్టీల ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా పరిశ్రమల వ్యాపారులు, యజమానులతో భేటీ అయ్యారు. వైసీపీ ప్రభుత్వం రాయల్టీ చెల్లింపు విధానాన్ని ప్రైవేటు సంస్థకు అప్పజెప్పడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటితో పాటు వ్యాపారులపై వున్న అన్నిరకాల కేసులను టీడీపీ అధికారంలోకి వచ్చాక తొలగించడం జరుగుతుందని వివరించారు.

వాసవి క్లబ్ మెంబరుకి ఆర్థికసాయం

అచ్చంపేట, మార్చి 30 : అచ్చంపేట వాసవి క్లబ్ (వాసవి సురక్ష కుటుంబ పథకం) వారు వాసవి క్లబ్ మెంబర్ డీ.వెంకన్నకు ఆర్థిక సాయంగా రూ 1.02 లక్షల చెక్కును శనివారం అందించారు. వెంకన్న కుటుంబంలో ఒకరు మృతి చెందగా సురక్షా కుటుంబ పథకం కింద ఈ చెక్కును అందించినట్టు గవర్నర్ పోలిశెట్టి సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో తువ్వా నాగమల్లేశ్వరరావు, నూరె వెంకట కోటిలింగం, అడ్డగిరి వెంకట సాంబపార్థసారథి, అనుమోలు శేషగిరిరావు, కట్టమూరి అప్పారావు, శ్రీనివాసరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

రెంటచింతల,మార్చి 30 : మండలంలోని తుమ్మకోట గ్రామంలో తెలంగాణ మద్యాన్ని(నాన్ డ్యూటీ పెయిడ్)స్వాధీనం చేసుకున్నట్లు గురజాల ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటరమణ,డీటీఎఫ్ ఎస్ఐ షరీఫ్‌లు తెలిపారు. శనివారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కృష్ణానదికి సమీప గ్రామం తుమ్మకోటకు భారీగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. 35 క్వార్టర్ల (180 ఎంఎల్) డ్యూటీ పెయిడ్ మద్యం, 180 ఎంఎల్ పరిమాణంగల 15 బాటిళ్లు, 23 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం (90 ఎంఎల్) బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడైన వేమా వెంకట సైదేశ్వరరావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని తెలిపారు.

కూటమి అధికారంలోకి రావాలి

● టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుబాబు

మాచర్లటౌన్, మార్చి 30: రాష్ట్రం రూపురేఖలు మారాలంటే కూటమి అధికారంలోకి రావాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు అన్నారు. శనివారం పట్టణంలోని 20వ వార్డులో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ సీనియర్‌నేత యాగంటి మల్లికార్జునరావుతో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి సూపర్ 6 పథకాలను ప్రజలకు వివరించారు. మాచర్ల నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిని గెలిపిస్తే మాచర్ల పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చుదిద్దుతామన్నారు. రాష్ట్ర భవిష్యత్ బాగుపడాలంటే చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. వార్డుల్లో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. నరసరావుపేటపార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు, మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ ప్రచారంలో మధుబాబు

ఒప్పిచర్లలో తాగునీటి కష్టాలు

● కుళాయిల్లో కలుషిత నీరు సరఫరా ..

● వ్యాధులబారిన పడుతున్నామంటూ కాలనీవాసుల ఆవేదన

● సమస్య తీర్చమని అడిగితే.. కన్నెత్తిచూడని నేతలు, అధికారులు

కారంపూడి, మార్చి30: మండలంలోని ఒప్పిచర్లలో నీటి కష్టాలు అధికమయ్యాయి. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా పట్టించుకోపోగా, ఓ ప్రజాప్రతినిధి అయితే 'అవి కలుషిత నీరు కాదు.. రంగు నీరు' అంటూ ఎద్దేవా చేశారు. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు, దీనికితోడు కలుషిత నీరు తాగడంతో పోలియో ప్రబలి బతుకు భారమయ్యే పరిస్థితులు దాపురించాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఎన్నికల సందర్భంలో తప్పితే మిగతా సమయాల్లో అధికారులు, రాజకీయ నేతలు తాము జీవిస్తున్న పరిసరాల వైపు కన్నెత్తి చూడడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను విన్నవించుకుందామని గ్రామస్థాయి నాయకుల వద్దకు వెళ్తే ఏకగ్రీవాల పుణ్యమా అని 'మీరు ఓటు వేస్తే మేము గెలవలేదంటూ సదరు నేతలు హేళన చేస్తున్నారంటూ ఆవేదన చెందుతున్నారు. పేరుకే విలేజ్ క్లినిక్, గ్రామానికో వైద్యుడు అని, కలుషిత నీటిని చూస్తూ కూడా వాటిని పరీక్షించకుండా, ఆ నీటిని తాగితే వచ్చే వ్యాధులు గురించి వివరించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. తమను ఈ ప్రమాదం నుంచి ఎవరు విముక్తులను చేస్తారంటూ కాలనీ వాసులు గోడు వెళ్లబోసుకుంటున్నారు.



కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న రంగు మారిన నీరు



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న భాష్యం ప్రవీణ్

బీసీలే టీడీపీకి అండాదండ..

● పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్

క్రోసూరు, మార్చి30: టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు బీసీలే టీడీపీకి అండాదండగా నిలిచారని పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీ డిక్లరేషన్‌ను అమలుచేసి తీరుతామన్నారు. ఈ మేరకు బీసీలకు అనేక సంక్షేమ పథకాలతో పాటు బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురానున్నామని స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలోని వందలాది మంది బీసీలు సభకు హాజరయ్యారు. టీడీపీ బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్, బీసీ సంఘాల నేతలు నల్లమేకల వెంకటేశ్వర్లు, చల్లా అనూపకళ, తోకా వెంకటరావు, గుడిపాడు బాషా, ఆంజనేయులు, పిల్లకతుపుల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కార్యాలయం ప్రారంభం ..

క్రోసూరు-అమరావతి రోడ్డులో ఏర్పాటుచేసిన టీడీపీ నియోజకవర్గ ఎన్నికల కార్యాలయాన్ని భాష్యం ప్రవీణ్ ప్రారంభించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి, వెంకటేశ్వరస్వామి చిత్రపటంతో ఆయన కార్యాలయంలోకి ప్రవేశించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



టీడీపీలో చేరిన వారితో భాష్యం ప్రవీణ్

వైసీపీని వీడి పలువురు టీడీపీలో చేరిక..

మండలంలోని అందుకూరుగ్రామంలో 20 కుటుంబాలకు చెందిన సుమారు 70 మంది వైసీపీని వీడి భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరారు. భాష్యం ప్రవీణ్ వారికి పార్టీ కండువాలువేసి సాదరంగా ఆహ్వానిం చారు. అందుకూరు మాజీ సర్పంచ్ తాళ్ళూరి శ్రీనివాసరావు, పార్టీ నేతలు చావా మురళీ, వాసిరెడ్డి మురళీ, తిరుమలరావు, వెంకటరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నందిరాజుపాలెంలో ప్రవీణ్ ఎన్నికల ప్రచారం

బెల్లంకొండ: బెల్లంకొండ మండలంలోని నందిరాజుపాలెం గ్రామంలో ఆదివారం నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రచారం నిర్వహించనున్నారని, ఈ ప్రచార కార్యక్రమానికి బాష్యం ప్రవీణ్‌తో పాటు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల టీడీపీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.




సమావేశంలో మాట్లాడుతున్న కన్నా రజనీ

రాజధాని విచ్ఛిన్నంతోనే వైసీపీ పతనం మొదలైంది

● జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కన్నా రజనీ

అమరావతి, మార్చి 30: రాష్ట్ర రాజధాని కోసం 32 వేల ఎకరాలు త్యాగాన్ని విస్మరించి విచ్ఛిన్నానికి పాల్పడంతోనే వైసీపీ ప్రభుత్వ పతనం మొదలైందని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రముఖ న్యాయవాది కన్నా రజనీ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక అమరావతిలోని ఏవీఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన జనసేన వీరమహిళల ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య ఈ సమావేశానికి హాజరయ్యారు. రజనీ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులపాలైందని, అభివృద్ధి 20 ఏళ్లు వెనక్కిపోయిందన్నారు. కూటమి తరుపున ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును ఎన్నుకుంటేనే అమరావతిని మరో సైబరాబాద్‌గా అభివృద్ధి చేస్తారని, పోలవరం పరిపూర్తవుతుందన్నారు. చంద్రబాబునాయుడు అభివృద్ధి, పవన్‌కళ్యాణ్ నిజాయతీ, బీజేపీ సహకారం రాష్ట్రాభివృద్ధికి తోడ్పడతాయని అన్నారు. భాష్యం ప్రవీణ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి కూటమి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



11వ శతాబ్దం నాటి ఆలయంలో లభ్యమైన నాగ విగ్రహాలు

నాగ విగ్రహాలు లభ్యం

దాచేపల్లి, మార్చి 30 : పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ గ్రామశివాలయంలో శనివారం నిర్మాణ పనులు చేపడుతూ ఉండగా 11వ శాతాబ్దం నాటి నాగ విగ్రహాలు వందకు పైగా లభించాయి. రెడ్డి రాజుల కాలంలో గ్రామాన్ని పాలించిన అనుమల మాచిరెడ్డి ప్రభువు ఆనాడు గ్రామంలో 101 బావులు, 101 దేవాలయాలు నిర్మించాడు. ఇంతటి చారిత్రక ప్రాముఖ్యం కలిగిన దేవాలయాలు నేడు శిథిలావస్థలో ఉన్నాయి. గ్రామస్థులు ఒక కమిటీగా ఏర్పడి దేవాలయాల పున:నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ క్రమంలో శనివారం ఒక గుడిలో అధిక సంఖ్యలో నాగ విగ్రహాలు లభించాయి.

ఘనంగా నేతి వెంకన్న స్వామి తిరునాళ్ల



నేతి వెంకన్న స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తున్న ఎస్పీ రవిశంకర్ రెడ్డి

రాజుపాలెం,మార్చి30: పల్నాటి తిరుమలగా పేరుగాంచిన మండలంలోని దేవరంపాడు కొండపై వేంచేసియున్న నేతి వెంకన్నస్వామి మూడవ శనివారం తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు సుమారు 70 వేల మంది హాజరై స్వామివారిని దర్శించుకు న్నారని ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రి అంబటి రాంబాబు, పల్నాడు ఎస్పీ రవిశంకర్ రెడ్డిలు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలుచేశారు. తొలుత ఎస్పీ రవిశంకర్ రెడ్డి తిరునాళ్ల సందర్భంగా బందోబస్తు, కొండపై పోలీసుశాఖ తరుపున చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు.

143 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

నూజెండ్ల, మార్చి 30: మండలంలోని మారెళ్ళవారిపాలెంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ 134 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని 6(ఏ), క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ విద్యాసాగర్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన రైస్‌మిల్లు యజమాని యక్కంటి వెంకటేశ్వరరెడ్డి ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని తనిఖీచేసి శుక్రవారం రాత్రి 64.9 క్వింటాళ్ళ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వినుకొండ మండలంలోని వెంకట రామాంజనేయ రైస్ వర్కింగ్ కంపెనీకి తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో మాచర్ల సీఎస్‌డీటీ మురళీ, వీఆర్వో జ్యోతి తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు

● మునిసిపల్ డిప్యూటీ ఇంజనీర్ ఓలేటి శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్, మార్చి 30: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టినట్లు మునిసిపల్ డిప్యూటీ ఇంజనీర్ ఓలేటి శ్రీనివాసరావు తెలిపారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా మున్సిపల్ డిప్యూటీ ఇంజనీరు ఓలేటి శ్రీనివాసరావు పట్టణంలోని 24వ వార్డు ప్రశాంతి నగర్, 25వ వార్డు పెద్ద చెరువు 9వ లైన్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రశాంతినగర్‌లో ఉన్న పెద్ద డ్రైయిలో సిల్ట్ తీయించి ట్రాక్టర్లతో వాటిని తరలించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ నరసింహారావు, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ లక్ష్మీనరసింహంను సత్కరిస్తున్న సిబ్బంది

తహసీల్దార్‌గా లక్ష్మీనరసింహం బాధ్యతల స్వీకారం

శావల్యాపురం, మార్చి 30: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల తహసీల్దార్‌గా పూండ్ల లక్ష్మీనరసింహం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం హనుమసముద్రం మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా శావల్యాపురానికి వచ్చారు. ఇప్పటివరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన నక్కా లక్ష్మీలావణ్య తూర్పుగోదావరి జిల్లాకు బదిలీఅయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ లక్ష్మీనరసింహంను కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బదిలీపై వెళుతున్న తహసీల్దార్ లక్ష్మీలావణ్యను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటనాగరాజు, ఆర్ఐ నాసరయ్య, ఏఎస్‌వో చెన్నయ్య, సీనియర్ అసిస్టెంట్ మోహన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



శ్మశాన భూములను పరిశీలించిన ప్రజా సంఘాల నాయకులు

శ్మశాన భూములకు ఫెన్సింగ్ నిర్మించాలి

● ప్రజా సంఘాల నాయకులు

వినుకొండ టౌన్, మార్చి 30: మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని శ్మశాన భూమి, శ్మశాన వాటికను ఆక్రమించి కొంత భూమిలో సుబాబులు వేసి మరికొంత స్థలంలో నీళ్ళ బావి తీయడాన్ని ప్రజా సంఘాల నాయకులు శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణకు గురైన శ్మశాన భూములను పరిశీలించి ఆక్రమణలు తొలగించి, శ్మశాన భూముల చుట్టూ ఫెన్సింగ్ నిర్మించాలని ఈ సందర్భంగా అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు వి.కోటానాయక్, భారత్ బచావ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు, పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, జాలలపాలెం మాజీ ఉపసర్పంచ్ సురభి వెంకటేశ్వర్లు సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. రెవెన్యూ అధికారులు కావాలని భూములు ఆక్రమణ గురికాలేదంటూ బుకాయిస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు ఆక్రమణకు గురైన శ్మశాన భూములను సర్వేచేసి భూములు పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ఆక్రమణలకు సహకరిస్తున్న అధికారులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆచార్య ముదిగొండకు అక్కిరాజు పురస్కారం

నరసరావుపేట కల్చరల్, మార్చి 30: చారిత్రక నవలాకారుడు ఆచార్య ముదిగొండ శివప్రసాద్‌కు ఋషి జీవనుడు, విద్యాదాత అక్కిరాజు రామయ్య పంతులు, అన్నపూర్ణ దంపతుల స్మారక పురస్కారం అందజేశారు. శనివారం అరండల్‌పేటలోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో జరిగిన సభలో ఈ పురస్కారాన్ని అందజేశారు. లయన్స్ క్లబ్, అక్కిరాజు ఆర్ట్స్, హైదరాబాద్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిచారు. ఇదే సభలో మరో గ్రహీత శ్రీమాన్ పంద్రప్రగడ శ్రీనివాసరావుకు పురస్కారాన్ని అందజేశారు. వక్తలు అక్కిరాజు రామయ్య పంతులు గురించి మాట్లాడారు. ఆయన దగ్గర విద్యనభ్యసించిన ఎందరో శిష్యులు నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని ప్రశంసించారు. సభకు కవి, గాయకులు, సినీ, టీవీ, రంగస్థల నటులు అక్కిరాజు సుందరరామ్మూర్తి అధ్యక్షత వహించారు. కాగా సభా సామ్రాట్ రత్నాకరం రాము కార్యక్రమాన్ని నిర్వహించారు. సుందరరామ్మూర్తి ఆలపించిన పద్యాలు శ్రోతలను అలరించాయి. కార్యక్రమంలో రాయవరపు సురేష్, అరిపిరాల రవిప్రసాద్ పలువురు సాహితీకారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలి: ఎంపీడీవో

నూజెండ్ల, మార్చి 30: గ్రామాల్లో వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో టీ వీరభద్రాచారి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపేందుకు త్వరలో రానున్న సాగర్ జలాలను దుర్వినియోగం కాకుండా సమర్థవంతంగా పర్యవేక్షించాలన్నారు. ఉపాధిహామీ పనుల ఆమోదం, ఇంటి పన్ను వసూలు, ఎలక్షన్‌కోడ్ అమలు తదితర అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జునరావు, ఈవోపీఆర్‌డీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరాంజనేయ స్వామి తిరునాళ్ల

రొంపిచర్ల, మార్చి 30: మండలంలోని మర్రిచెట్టుపాలెంలోని వీరాంజనేయ స్వామి తిరునాళ్ల శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, నాగవల్లి దళార్చన పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు పొంగళ్లు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలోని నాగేంద్రస్వామి, తులసి కోట వద్ద పూజలు నిర్వహించారు. బెహరావారిపాలెం, దాసరిపాలెం, విప్పర్ల, రెడ్డిపాలెం, కొత్తపల్లి, నలగార్లపాడు, మాచవరం, పరగటిచర్ల గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ చేశారు.

'పంచాయతీ కార్యదర్శులకు సంక్షేమ పథకాల పంపిణీని అప్పగించాలి'

నరసరావుపేట, మార్చి 30: పంచాయతీ కార్యదర్శులకు పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలు పంపిణీ చేసే బాధ్యతను ఇవ్వవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్య ఎన్నికల అధికారి అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు శనివారం విజ్ఞప్తిచేశారు. వలంటీర్లను సంక్షేమ పథకాలకు దూరంగా ఉంచాలని భారత ఎన్నికల సంఘం రాష్ట్ర ఎన్నికల అధికారికి ఆదేశాలు జారీ చేయడం హర్షనీయమన్నారు. వలంటీర్లు సంక్షేమ పథకాలకు ఎన్నికల కోడ్ ముగిసే వరకు దూరంగా ఉంచాలని వారి వద్దనున్న సెల్ ఫోన్లు, ఇతర పరికరాలను కూడా తీసుకోవాలని ఆదేశాలను వెనువెంటనే అమలు చేయాలని కోరారు. గత కొన్నిరోజులుగా సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ అనేక విజ్ఞప్తులు చేసినట్లుగా ఆదేశాల్లో చెప్పడం జరిగిందన్నారు. ఈ పరిస్థితుల్లో సంక్షేమ పథకాల డిస్ట్రిబ్యూషన్‌లో పారదర్శకత ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని పేర్కొన్నారు.

ఘనంగా తిరుమలదేవుని తిరునాళ్ల

ఈపూరు, మార్చి 30: మండలంలోని అగ్నిగుండాల సమీపంలోని తిరుమలదేవుని తిరునాళ్ళ శనివారం ఘనంగా జరుపుకున్నారు. తిరునాళ్ళను పురస్కరించుకొని భక్తులు స్వామివారికి పొంగళ్లు పొంగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అన్నదానం నిర్వహించారు.

గ్రామాల్లో తాగునీటికి కటకట

● ఉప్పరపాలెంలో నీరునిల్... మద్యం ఫుల్
● నీరుకలుషితం పేరుతో ఉప్పరపాలెంలో నీటి సరఫరా నిలిపివేత
● తిమ్మాయిపాలెం, కుమ్మరపాలెం పైపులకు చేరని చెరువునీరు
● రెండు పంచాయతీల్లో తాగునీటికి జనం కటకట
● ముందుచూపులేకనే గ్రామాల్లో తాగు నీటికి వెతలు
● ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై పట్టించుకోని అధికారులు



మోటర్ బైక్‌పై నీటిని తెచ్చుకుంటున్న ఉప్పరపాలెం యువకులు

వినుకొండ టౌన్, మార్చి 29: ఆ గ్రామంలో మద్యం మాత్రం ఏరులై పారుతోంది. అక్కడ తాగునీరు కంటే మద్యం ప్రజలకు అందుబాటులో ఉండటం విశేషం. సింగర చెరువులో తాగునీరు అడుగంటడంతో మండలంలోని ఉప్పరపాలెం, తిమ్మాయిపాలెం, కుమ్మరపాలెం గ్రామాల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీటి పథకం ద్వారా, చెరులో అడుగంటిన నీరు దుర్వాసన రావడంతో, ప్రజల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు నీటి సరఫరా నిలిపివేసినట్లు వైసీపీ నాయకులు వాపోయారు. దీంతో గ్రామాల్లో నిరుపేదలకు గుక్కెడు నీరు దొరక్క, గత కొంత కాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకొరగా అందుబాటులోని బోరునీటిపైనే ఉప్పరపాలెం ప్రజలు ఆధారపడుతున్నారు. ఇటీవల జలజీవన్ పథకం కింద కాలనీలో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్‌కు నిధుల విడుదల జాప్యంతో తీవ్ర ఆటంకం కలగడంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. వేసిన ఐరన్‌పైపులను పిల్లలు ఐస్‌లకు అమ్ముకున్నట్లు స్థానికులు చెబుతున్నారు.



ఉప్పరపాలెం చెరువు సమీపంలో నిరుపయోగంగా ఉన్న ఫిల్టర్ బెడ్



మోటర్ల ద్వారా తిమ్మాయిపాలెం ప్రజలకు సరఫరా అవుతున్న రంగుమారిననీరు

నిరుపయోగంగా ఫిల్టర్ బెడ్లు

ఉప్పరపాలెం సింగర చెరువు ద్వారా వచ్చే సాగర్ జలాలను, సమీపంలోని పంపుహౌస్ ద్వారా ఉప్పరపాలెం పంచాయతీతోపాటు, తిమ్మాయిపాలెం, కుమ్మరపాలెం ప్రజలకు వేరువేరుగా అధికారులు నీటి సఫరా చేయాల్సి వుంది. నూతనంగా నిర్మించిన పిల్టర్ బెడ్లు పనిచేయకపోవడంతో, డైరెక్టుగా మోటార్ల ద్వారా చెరువు నీటిని రెండు పంచాయతీల్లోని ప్రజలకు నీటిని సరఫరా చేయాల్సి ఉంది. ఇటీవల మోటర్లు మరమ్మతులకు గురికావడంతో నీటిసఫరా నిలిచిపోయింది. ప్రభుత్వం నుంచి మరమ్మతులకు నిధులు విడుదల కాకపోడంతో, సర్పంచులే ఖర్చులు భరించి నీటి సరఫరాకు ఏర్పాట్లుచేసినా, ఫలితం లేకపోవడంతో నీటి సరఫరాపై కుమ్మరపాలెం, తిమ్మాయిపాలెం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చేపల వేటతో కలుషితమైన నీరు

చెరువు నీటిలో చేపలు పెరిగి, పెద్దవి కావడంతో వాటిపై కొందరు కన్ను పడింది. రాత్రికి, రాత్రి గుట్టు చప్పుడు కాకుండా కొన్ని రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో చేపలు పట్టారు. ఉప్పరపాలెం గ్రామస్థాయి నాయకులకు చెరువులోని చేపల్లో వాటాకుదరకపోవడంతో నీటిని నిలిపివేశారు. ఇదిలా ఉండగా తిమ్మాయిపాలెం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వీధి కుళాయిలకు, నీటి సఫరా నిలిచిపోయింది. గ్రామస్థులు పురాతన భావినీటిపై ఆధారపడి, కిలోమీటర్ల కొద్దీ పైపుల సాయంతో, విద్యుత్ మోటర్లతో నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. బావినీరు తాగాలంటే ఇబ్బందులు ఎదుర్కోలేక కొందరు సుదూర ప్రాంతాల్లోని ఆర్‌వో ప్లాంట్ నీటిని, కొని తాగాల్సి వస్తున్నదని ఆగ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల, పాలకులు నిరుపేదలు నివాసం ఉండే ఉప్పరపాలెం, తిమ్మాయిపాలెం, కుమ్మరపాలెం ప్రజలకు తాగునీటి సరఫరాపై శ్రద్ధ చూపాలని పలువురు కోరుతున్నారు. దీనిపై వినుకొండ మండలం నీటి సఫరా అధికారి అశోక్‌రెడ్డిని వివరణ కోరగా త్వరలో సింగర చెరువుకు సాగర్ జలాలతో నీటిని నింపి, నీటి సరఫరాకు చర్యతీసుకుంటామన్నారు.



తిమ్మాయిపాలెం పంచాయతీలో నీటికోసం భావి చుట్టూ ఏర్పాటుచేసిన పైపులు

రాష్ట్రాభివృద్ధిలో ఎన్‌ఆర్‌ఐల పాత్ర ఎనలేనిది

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



నిరంజన్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన

వినుకొండ, మార్చి 30: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో ప్రవాస భారతీయులు (ఎన్‌ఆర్‌ఐ) పాత్ర ఎనలేనిదని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. తానా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శృంగవరపు నిరంజన్ నంద్యాల నుంచి విజయవాడకు వెళ్తూ, బాల్య మిత్రుడైన న్యాయవాది కావూరి గోపినాథ్‌తో కలిసి మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును కలిశారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఖండాంతరాల్లో ఉన్నప్పటికి మాతృభూమిపై మమకారాన్ని మరిచిపోకుండా అన్ని విషయాల్లో ఇక్కడ వారికి అండగా నిలుస్తున్నారని వారి సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రశంసించారు. అనంతరం నిరంజన్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేసే ఆలోచనలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన మల్లికార్జునరావులు నిరంజన్‌ను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.

చలివేంద్రాలు ప్రారంభం

సాటి ప్రజలకు సాయం చేయడంలో ఉన్న సంతృప్తి వేరెక్కడ రాదని తానా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నిరంజన్ శృంగవరపు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరికి ఉపకారం చేయగలుగుతున్నామంటే మనల్ని ఆ స్థాయిలో ఉంచిన భగవంతునికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఉండాలని అన్నారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా ఏర్పాటుచేసిన పలు సేవా కార్యక్రమాలు గురించి ఆయన కొనియాడారు. కార్యక్రమంలో శివశక్తి ఫౌండేషన్ మేనేజర్ రమణారావులతోపాటు స్థానికులు పాల్గొన్నారు.



మొక్కులు తీర్చుకుంటున్న టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజేటి వెంకటేష్ తదితరులు

ఆలయంలో చదలవాడ ప్రత్యేక పూజలు

నరసరావుపేట టౌన్, మార్చి 30: నరసరావుపేట పట్టణం పాతూరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం టీడీపీ సీనియర్ నాయకుడు మాజేటి వెంకటేష్ నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థిగా డాక్టర్ చదలవాడ అరవింద బాబుకు సీటురావాలని మొక్కుకున్న నేపథ్యంలో 11 కొబ్బరికాయలు కొట్టారు. ఆదేవిధంగా వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదేవిధంగా ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలు విజయం సాధించాలని, ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయాలని పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రియాదవ్, తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్ధనబాబు, గూడురు శేఖర్, వ్యాపారవర్గాలు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

రెంటచింతల, మార్చి 30: మండలంలోని తుమ్మకోట గ్రామంలో తెలంగాణ మద్యాన్ని (నాన్ డ్యూటీ పెయిడ్) స్వాధీనం చేసుకున్నట్లు గురజాల ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటరమణ, డీటీఎఫ్ ఎస్ఐ షరీఫ్‌లు తెలిపారు. శనివారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కృష్ణానదికి సమీప గ్రామం తుమ్మకోటకు భారీగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. 35 క్వార్టర్ల (180 ఎంఎల్) డ్యూటీ పెయిడ్ మద్యం, 180 ఎంఎల్ పరిమాణంగల 15 బాటిళ్లు, 23 నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం (90ఎంఎల్) బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడైన వేమా వెంకట సైదేశ్వరరావును అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని తెలిపారు.

ఘనంగా నేతి వెంకన్న స్వామి తిరునాళ్ల

రాజుపాలెం, మార్చి 30: పల్నాటి తిరుమలగా పేరుగాంచిన మండలంలోని దేవరంపాడు నేతి వెంకన్నస్వామి మూడవ శనివారం తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు సుమారు 70వేల మంది హాజరై స్వామివారిని దర్శించుకున్నారని ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రి అంబటి రాంబాబు, పల్నాడు ఎస్పీ రవిశంకర్ రెడ్డిలు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలుచేశారు. తొలుత ఎస్పీ రవిశంకర్ రెడ్డి తిరునాళ్ల సందర్భంగా బందోబస్తు, కొండపై పోలీసుశాఖ తరుపున చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.



టీడీపీ నాయకుడు మన్నె పల్లెయ్య అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తదితరులు

పల్లెయ్య మృతి టీడీపీకి తీరని లోటు: జీవీ

బొల్లాపల్లి, మార్చి 30: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ, టీడీపీ సీనియర్ నాయకుడు సంపతి మన్నె పల్లెయ్య మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. పల్నాడు జిల్లా టీడీపీ అభ్యర్థులు జీవీ ఆంజనేయులు శుక్రవారం గుండెపోటుతో మరణించిన మన్నె పల్లెయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జీవీ ఆంజనేయులు శనివారం పలుకూరు వచ్చి మన్నె పల్లెయ్య మృతదేహాన్ని సందర్శించి పార్టీ పతాకాన్ని ఉంచి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మన్నె పల్లెయ్య అంతిమ యాత్రలో జీవీ ఆంజనేయులు పాల్గొని కాడి మోశారు. మన్నెపల్లెయ్య కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మన్నెపల్లెయ్య కుటుంబానికి సానుభూతిని, సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పెమ్మసాని నాగేశ్వరరావు, అరికట్ల వాసుదేవరెడ్డి, గోవిందునాయక్, హనుమా నాయక్, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, నిమ్మకాయల బాబూరావు, యలగాల బాదరయ్య తదితర టీడీపీ నాయకులు ఉన్నారు.



యడ్లపాడులో జరిగిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

కష్టపడితేనే విజయం: ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

● నాయకులు, కార్యకర్తలకు ఎంపీ దిశానిర్దేశం

యడ్లపాడు, మార్చి 30: రానున్న నలభై రోజులు ఎంతో కీలకమైనవని, కష్టపడితేనే అనుకున్న విజయం సాధించగలమని టీడీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. మండల కేంద్రమైన యడ్లపాడులో నూతనంగా ఏర్పాటుచేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం మండల, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాలపై ముందుగా నాయకులు, కార్యకర్తలు అవగాహన పెంచుకుని విస్తృత ప్రచారం చేయాలన్నారు. చిలకలూరిపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయం దాదాపు ఖరారైందని, ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థులను మార్చడమే అందుకు నిదర్శనమన్నారు. తెలుగుదేశం పార్టీలోకి వచ్చాక తొలిసారి యడ్లపాడుకు వచ్చిన ఎంపీ లావును మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, బీజేపీ నాయకులు పోట్రు పూర్ణచంద్రరావు, టీడీపీ నాయకులు కుర్రా రత్తయ్య, కె.రఘురామారావు, జరుగుల అంజేశ్వరరావు, పిల్లి స్టీఫెన్‌కరుణాకర్, ముక్తా వాసు, ఎం.వీరారెడ్డి, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



డాక్టరేట్‌ను అందుకుంటున్న ముత్తవరపు సురేష్‌బాబు

ముత్తవరపు సురేష్‌బాబుకు డబుల్ డాక్టరేట్

● సాంస్కృతిక, సేవా రంగాల్లో ఒకటి, ఆధునిక వ్యవసాయ పద్ధతులకు మరొకటి

యడ్లపాడు, మార్చి 30: మండల కేంద్రమైన యడ్లపాడుకు చెందిన ముత్తవరపు సురేష్‌బాబుకు డబుల్ డాక్టరేట్ పట్టా వరించింది. కళ, సాంస్కృతిక, సామాజిక సేవ విభాగంతోపాటు, ఆధునిక వ్యవసాయ పద్ధతుల నిర్వహణ కేటగిరీలోనూ రెండు గౌరవ డాక్టరేట్‌లు లభించాయి. అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ ఈ డాక్టరేట్‌లను ప్రకటించింది. పాండిచ్చేరిలోని కంబన్ కళైయరంగం యూనివర్శిటీ ఆడిటోరియంలో శనివారం సదరు యూనివర్శిటీ ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు, పాండిచ్చేరి జీహెచ్‌పీయూ జేసీ డాక్టర్ కె వేలార్‌మది, పాండిచ్చేరి విశ్రాంత ఎస్పీ డాక్టర్ ఎస్ రామచంద్రన్, పాండిచ్చేరి జీహెచ్‌పీయూ కోల్‌కత రీజియన్ జేడీ సుభాషిష్ సాహ, యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ కె వెంకటేషన్, తమిళనాడు ప్రిన్సిపల్ సెక్రటరీ కె సంపత్‌కుమార్‌ల చేతుల మీదుగా ఒకేసారి రెండు డాక్టరేట్‌లను సురేష్‌బాబు అందుకున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పుడమి గ్రూప్ సంస్థ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న సురేష్‌బాబు గత 20 ఏళ్లుగా యడ్లపాడులో పుచ్చలపల్లి సుందరయ్య నాటకోత్సవాల కమిటీని ఏర్పాటుచేసి ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి క్రమం తప్పకుండా నాటకోత్సవాలను నిర్వహిస్తున్నారు. సాంస్కృతిక, సామాజిక సేవ, వ్యవసాయరంగంలో సురేష్‌బాబు చేస్తున్న విశేష కృషికి అమెరికాకు చెందిన యూనివర్శిటీ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది.



చిలకలూరి పేటలో కవాతు జరుపుతున్న పారా మిలటరీ దళాలు

చిలకలూరిపేటలో పారా మిలటరీ దళాల కవాతు

చిలకలూరిపేట, మార్చి 30: పట్టణంలోని ప్రధాన వీధుల్లో శనివారం పారా మిలటరీ దళాలు కవాతు నిర్వహించాయి. స్థానిక నరసరావుపేట సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ కవాతు చౌత్రసెంటర్, కళామందిర్ సెంటర్, పురుషోత్తమపట్నం, అడ్డరోడ్డు సెంటర్ల మీదుగా ముందుకుసాగింది. కాగా ఎన్నికల సందర్భంగా ప్రజలు స్వచ్ఛందంగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకొని శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరుతూ ఈ కవాతును నిర్వహించారు. కార్యక్రమంలో నరసరావుపేట డీఎస్పీ వర్మ, ట్రైనీ డీఎస్పీ జగదీష్, చిలకలూరిపేట అర్బన్ సీఐ రమేష్ చిలకలూరిపేట అర్బన్ ఎస్‌ఐలు పుల్లారావు, సుమన్‌లు, రూరల్ ఎస్‌ఐలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులతో సమావేశం

చిలకలూరిపేట, మార్చి 30: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి బీ నారదముని అధ్యక్షతన నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ బృందాలకు నిబంధనల ప్రకారం నిర్వహించాల్సిన వ్యవహారాల గురించి అవగాహన కల్పించారు. వీరిలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, వీడియో టీమ్‌లు, మోడల్ కోడ్‌కు సంబంధించిన టీమ్‌లు ఉన్నాయి. కార్యక్రమంలో డీఎస్పీ వర్మ, చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్ తదితరులు ఉన్నారు.

పశువుల గడ్డి, పండ్ల మొక్కలు దగ్ధం

నాదెండ్ల, మార్చి 30: మండలంలోని గణపవరం గ్రామ పరిధిలో జరిగిన అగ్ని ప్రమాదంలో పశువుల గడ్డితో పాటు, పండ్ల మొక్కలు దగ్ధమయ్యాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని పొలంలో గ్రామానికి చెందిన బడుగు ఆనంద్ ఇల్లు వేసుకొని సోలార్ పంపు సెట్టు ద్వారా గడ్డి పెంచుకుంటూ గేదెలను మేపుకొని జీవనం సాగిస్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్ కాల్చి గడ్డిపై విసరటంతో మంటలు వ్యాపించి రెండు పంపుసెట్లు, సోలార్ పైపులైన్ పూర్తిగా దగ్ధమయ్యాయి. పక్కనే ఉన్న కాటా కృష్ణకు చెందిన 50సెంట్ల భూమిలో పండ్ల మొక్కలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నాదెండ్ల, మార్చి 30: మండలంలోని గణపవరం పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో శనివారం ఒకరు గాయపడ్డారు. గ్రామానికి చెందిన నాగభైరు కోటేశ్వరరావు స్థానిక కంపెనీలో ఆవులకాపరిగా పనిచేస్తున్నాడు. ఉదయం 9గంటల సమయంలో డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్తూ ద్విచక్రవాహనంపై రోడ్డుదాటే సమయంలో మేదరమెట్ల నుంచి విజయవాడ వైపు గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీ కోటేశ్వరరావు వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడగా 108 అంబులెన్స్‌లో చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైసీపీ గెలుపే అంతిమ లక్ష్యం

● కార్యకర్తల సమావేశంలో నేతల పిలుపు

చిలకలూరిపేట, మార్చి 30: రానున్న ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యంగా అహర్నిశలు కృషిచేయాలని వైసీపీ ఎంపీ అభ్యర్థి అనీల్‌కుమార్‌యాదవ్, చిలకలూరిపేట వైసీపీ అభ్యర్థి కే మనోహర్‌నాయుడు శనివారం పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్ఎంఎస్ షాదీఖానాలో చిలకలూరిపేట నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో వారు మట్లాడారు. వైసీపీ పాలనలో నియోజకవర్గంలో జరిగిన పథకాలను అన్నివర్గాల ప్రజలకు తెలియజెప్పాలని వారు కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్, లేళ్ళ అప్పిరెడ్డి, మద్దాలి గిరిధర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.